ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్ రావు తెలిపారు. 56 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 16 కేంద్రాల్లో వృత్తివిద్య ప్రాక్టికల్స్ జరిగినట్లు ఆయన అన్నారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో 3,808 మందికి 3,631 మంది హాజరుకాగా 177 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షల్లో 3,126 మందికి 3,057 మంది హాజరు కాగా 69 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

పరీక్షలను పరిశీలిస్తున్న అధికారి

పరిహారం.. పరిహాసం..!

రైతుల పట్ల ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయింది. మిచౌంగ్ తుపాను పంట నష్ట పరిహారం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఖరీఫ్ పంట దెబ్బతినడంతో దాళ్వా పెట్టుబడులకు రైతులు నానా ఇబ్బందులు పెడుతున్నారు. పెట్టుబడి సాయం అందిస్తే ఎంతో కొంత ఊరటనిస్తుందని అన్నదాత ఆశగా ఎదురుచూస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ముందే పరిహారం ఇస్తామని చెప్పిన పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులు మౌనంగా రోదిస్తున్న పరిస్థితి నెలకొంది.

రైతులకు అందని మిచౌంగ్ తుపాను పంట నష్టం

రెండు జిల్లాల్లో 87 వేల ఎకరాల్లో పంటలకు దెబ్బ

అన్నదాతకు అందాల్సిన నష్టపరిహారం సుమారు రూ.41 కోట్లు

సంక్రాంతికి ఇస్తానంటూ ప్రభుత్వం వాగ్దానం

ఇప్పటికీ అతీగతీలేని పరిస్థితి

దాళ్వా పెట్టుబడులకు రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన ఖరీఫ్‌లో పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు, మినుము, పత్తి, వేరుశెనగ వంటి అనేక పంటలను రైతులు సాగుచేశారు. పంట చేతికొచ్చి మాసూలు ప్రారంభించిన సమయంలో ఒక్కసారిగా మిచౌంగ్ తుపాను విరుచుకుపడి విలయతాండవం సృష్టించింది. దీంతో ఏలూరు జిల్లాలో 37,936 ఎకరాలు, పశ్చిమలో 49,495 ఎకరాలు మొత్తం 87,431 ఎకరాల్లో రైతులు పంట కోల్పోయారు. ఈ లెక్కలు కేవలం 33 శాతం పైన దెబ్బతిన్న పంటలు మాత్రమే. 30 శాతంలోపు దెబ్బతిన్న పంట ఇంకా వేలాది ఎకరాల్లో ఉన్నప్పటికీ నిబంధనల పేరుతో ప్రభుత్వం లెక్కల్లోకి తీసుకోకుండా పక్కకు పెట్టేసింది. తుపాను దెబ్బకు అత్యధికంగా వరి పంట 69,697 ఎకరాల్లో దెబ్బతింది. మినుము, పొగాకు, పత్తి పంటలు సైతం దెబ్బతిన్న పరిస్థితి ఉంది. సంక్రాంతికి ముందే పంట నష్టపరిహారం అందిస్తామంటూ సిఎం జగన్ ప్రకటించారు. మిచౌంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఏలూరు జిల్లాలో రూ. 14.87 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.26.06 కోట్లు సుమారు మొత్తం రూ.41 కోట్ల వరకూ రైతులకు అందాల్సి ఉంది. సంక్రాంతి పండుగ పూర్తయ్యి నెలరోజులు గడుస్తున్నా ఇప్పటికీ రైతులకు పరిహారం అందని పరిస్థితి. ఖరీఫ్‌లో ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయంలో దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు రూ.35 వేలకు పైగా పెట్టుబడులు పెట్టిన రైతులకు చిల్లిగవ్వ చేతికందని పరిస్థితి ఏర్పడింది. రెండెకరాలు సాగుచేసిన రైతు దాదాపు రూ.70 వేలకు పైగా నష్టపోగా, ఐదెకరాలు సాగుచేసిన రైతు దాదాపు రూ.రెండు లక్షల వరకూ నష్టాన్ని చవిచూశారు. జిల్లాలో 80 శాతం సాగు కౌలు రైతులే చేస్తున్నారు. దీంతో కౌలు రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది. ఖరీఫ్ దెబ్బతినడంతో రైతులకు చేతిలో చిల్లిగవ్వలేకుండా పోయింది. దీంతో దాళ్వాపెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట నష్టం అందిస్తే ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని అన్నదాత కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నాడు. ప్రభుత్వం మాత్రం రైతులను పరిహారం అందించకుండా పరిహసిస్తున్న దుస్థితి కొనసాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడితే ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకూ రైతులకు పంట నష్ట పరిహారం అందే అవకాశం లేకుండా పోనుంది. దీంతో నష్ట పరిహారం వెంటనే విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని అన్నదాత కోరుతున్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వం పంట నష్ట పరిహారం వెంటనే విడుదల చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

కరువుతో దెబ్బ పంటలకు నష్టపరిహారం సం'గతేంటి'..!

ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో ఏలూరు జిల్లాలో తీవ్ర కరువు ఏర్పడింది. చింతలపూడి, చాట్రాయి, కామవరపుకోట, ద్వారకాతిరుమల, బుట్టాయగూడెం వంటి అనేక మండలాల్లో రైతులు తీవ్ర దుర్భిక్ష పరిస్థితిని ఎదుర్కొన్నారు. సాగునీరు లేక పంటలు ఎండిపోవడంతో పశువుల మేతగా వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల లెక్కల ప్రకారం కరువు నేపథ్యంలో దాదాపు 12 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎంఎల్ఎ ఎలిజా, మిగిలిన ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందేలా చేస్తామని రైతులకు మాటిచ్చారు. జిల్లాలో ఏ ఒక్క మండలాన్నీ కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించలేదు. నిబంధనల పేరుతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. కరువుతో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రగులుతున్న దెందులూరు..

టిడిపి, వైసిపి శ్రేణుల పరస్పర దాడులు

బాహీబాహీకి సై అంటున్న నేతలు

ప్రభుత్వాసుపత్రిలో సైతం సవాళ్ల పర్వం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్, అర్బన్

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ దెందులూరు గడ్డపై ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల పలు సంఘటనలు స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా పార్టీల మధ్య వివాదాలు కార్యకర్తలకు చేరడంతో ఎప్పుడు ఏ వివాదం రాజుకుంటుందో, ఎవరు ఎప్పుడు దాడి చేసుకుంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పార్టీల మధ్య వివాదాలు అడ్డుకట్ట వేయలేక పోలీసులకు తల బొప్పి కట్టిస్తున్నాయి. తాజాగా కొప్పకలో జరిగిన మరో సంఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

గాయపడిన వారిని పరామర్శిస్తున్న వైసిపి ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి

కొప్పాక గ్రామంలో ఉద్రిక్తత..

దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన కాటేపల్లీ నాగ సురేష్ ఇంటిపై కొంత మంది సోమవారం దాడికి పాల్పడ్డారు. ఈ దాడి, తదనంతర ఘటనల్లో టిడిపి, వైసిపి గ్రూపులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ దాడిలో సుమారు రూ.3 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలుపుతున్నారు. దాడి చేసిన వారు వైసిపి కార్యకర్తలని టిడిపి వారు ఆరోపిస్తుంటే.. కాదు తమ వాళ్లపైనే దాడి చేశారని వైసిపి వారు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని ఏలూరు జిల్లా సర్వేజనా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ఆసుపత్రి వద్ద ఘర్షణ..

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరోసారి ఎదురుపడిన టిడిపి - వైసిపి శ్రేణులు ఘర్షణ పడడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైసిపి నాయకుల కవ్వింపు చర్యలు - టిడిపి నాయకుల సవాళ్లతో ఆసుపత్రి అట్టుడికింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేశారు.

దెందులూరులో వైసిపి వరుస దాడుల నేపథ్యంలో మరోసారి ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి మారడం ఆందోళన కలిగించింది. ఆదివారం రాత్రి పెదవేగి మండలం కొప్పాకలో వైసిపి మూకల దాడిలో గాయపడిన కాటేపల్లి సురేష్ సహ పలువురు క్షతగాత్రులను పరామర్శించటానికి గేట్ - 1 ద్వారా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేరుకున్న సమయంలో రెండోసారి వివాదం తలెత్తింది. అదే సమయంలో గేట్-2 ద్వారా ఆసుపత్రికి దెందులూరు వైసిపి ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి సహా పలువురు వైసిపి నాయకులు చేరుకున్నారు. పరామర్శ అనంతరం మీడియాతో చింతమనేని మాట్లాడుతూ ఉండగా గేట్-1 వద్దకు జెడ్పి ఛైర్మన్ భర్త అయిన ఘంటా ప్రసాద్‌తో సహా పలువురు వైసిపి నాయకులు చేరుకున్నారు.

ఒకరినొకరు రెచ్చ గొడుతూ ఇరుపార్టీల కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక వర్గం నాయకులు హద్దు దాడడంతో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేసిన మరోవర్గం నాయకులు - పోలీసుల సహకారంతో హాస్పిటల్ లోపలికి వెళ్లి, లాక్ చేసిన ఇనుప గేట్లు లోపలి నుంచి వాగ్వాదానికి దిగారు. గేట్లు తీసుకుని బయటకొస్తే తమ తడాఖా చూపిస్తామంటూ సవాల్ చేసుకున్నారు. హుటాహుటీన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

ఇ - చలానాలు రద్దు చేయాలి

స్టాప్‌లైన్ వైలేషన్ పేరుతో విధించిన..

ఆటోలు, ట్యాక్సీలతో భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటోలు, టాక్సీలు ఇతర వాహనాలపై విధించిన ఇ-చలానాలను బేషరతుగా రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జె.గోపి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జ్యూట్ మిల్ సెంటర్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకూ ఆటోలు, టాక్సీలతో భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ ఏలూరు నగరంలోని పాత బస్టాండ్ వద్ద సిగ్నల్ పాయింట్ స్టాప్ లైన్, సీసీ కెమెరాలు క్రమ పద్ధతిలో లేవని, వాటిని క్రమబద్ధీకరించాలని, అప్పటివరకూ విధించిన చలానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసలే కిరాయిలు లేక సతమతమవుతున్న ఆటో, టాక్సీ డ్రైవర్లపై రూ.300 నుంచి రూ.20 వేల వరకూ ఇ-చలానాలను విధించడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, టాక్సీ డ్రైవర్లకు వాహన మిత్ర పేరుతో రూ.పది వేల ఇచ్చి, చలానాలు, డీజిల్ ధరలలో లక్షకు పైగా గుంజుకుంటోందని విమర్శించారు. జిఒ 21ను రద్దు చేయాలని, పెంచిన రోడ్డు టాక్స్, గ్రీన్ టాక్స్‌లు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇ - చలానాలు ట్రాన్స్‌పోర్టు డిపార్ట్మెంట్‌కు లింక్ చేయడంతో త్రైమాసిక రహదారి పన్నులను చెల్లించాలన్నా, ఫిట్నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలన్న ఇ-చలానాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎటు చూసినా రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని, టోల్‌గేట్ల ఛార్జీలు విపరీతంగా పెంచేశారని, పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పొరుగు రాష్ట్రాల కంటే అధికంగా ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణం ఆటోలు, టాక్సీలపై విధించిన ఇ-చలానాలను భేషరతుగా రద్దు చేయాలని, లేని పక్షంలో ఏలూరు నగరంలోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీ, ధర్నా నిర్వహణకు బుద్ధ నాగ సూరిబాబు, దుర్గారావు, మెరుగు రాఘవ, వల్లూరి ఆంజనేయులు నాయకత్వం వహించారు.

ఆటోలు, ట్యాక్సీలతో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు, నేతలు

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ దగా డిఎస్‌సి కాదు, మెగా డిఎస్‌సి కావాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచి నోటిఫికేషన్ సమయం పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చూపిస్తున్న నిరంకుశ వైఖరిని విడనాడాలని, రాష్ట్రంలో 25 వేల డిఎస్‌సి పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాలకు 6,100 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 117 జిఒ రద్దు చేయాలని, మొత్తం ఖాళీ పోస్టులకు మెగా డిఎస్‌సి విడుదల చేయాలని, అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ తక్షణం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, ఇ మెగా డిఎస్‌సి కోసం లక్షల మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. తక్షణం ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులను భర్తీ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు

స్పందనలో 235 అర్జీల స్వీకరణ

జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి

ఏలూరు: జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో 235 అర్జీలు స్వీకరించడం జరిగిందని డిఆర్ఒ డి.పుష్పమణి తెలిపారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, ఎపిక్ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజిలెన్స్ సివిల్ సప్లై అధికారిని దేవకి దేవి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పుష్పమణి మాట్లాడుతూ ప్రతి అర్జీ సంబంధిత అధికారులు క్షుణంగా పరిశీలించి సకాలంలో అర్జీదారుడికి నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

అర్జీలలో కొన్ని : చేతకాయి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు తమకు మూడు ఏంటి సర్వీసులు ఉన్నట్లు కరెంటు డిపార్ట్మెంట్ వారు తప్పుగా చూపించారు. తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు రావడం లేదని, మూడు కరెంటు సర్వీసులను తొలగించి, నాకు న్యాయం చేయమని అర్జీ అందజేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన తేజస్విని తమ పాపకు వినికిడి మిషన్ ఇప్పించాల్సిందిగా అర్జీ అందజేశారు. పోలవరం మండలం రూటిగుంటకు చెందిన సాంబశివరెడ్డి ఆర్‌టిజి కొండారెడ్డి గ్రాంట్లు నుంచి ట్రాక్టర్ మంజూరు చేయమని అర్జీ అందజేశారు. తూటాగుంటకు చెందిన కొండ సరిత ఆర్ అండ్ ఆర్‌కు సంబంధించిన 18 సంవత్సరాలు నిండిన తమకు ప్యాకేజీ మంజూరు చేయాల్సిందిగా అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఐక్యవేదిక సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రెడ్డి గణపవరంలో ప్రారంభించి బుట్టాయగూడెం, దొరమామిడి, నూతిరామన్నపాలెం గ్రామాల్లో విస్తతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, రైతు కూలి సంఘం మండల నాయకులు తగరం బాబూరావు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి కొచ్చి పదేళ్లు పూర్తయ్యిందని, అయినా రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేసిందని తెలిపారు. రాష్ట్రంలోనివైసిపి ప్రభుత్వం కార్మికుల, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈనెల 16న జరగబోయే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు లక్షలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, రైతు కూలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిలో జిల్లాకు రెండో స్థానం

ప్రజాశక్తి - ఏలూరు

పాల ఉత్పత్తిలో జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానం, గుడ్ల ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉందని పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూ బాబు తెలిపారు. సోమవారం ఆయన పశు సంవర్ధక శాఖ ప్రగతిని వివరిస్తూ జిల్లాలో 11 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 66 వెటర్నరీ డిస్పెన్సరీలు, 57 గ్రామీణ పశు వైద్యశాలలు, 537 ఆర్‌బికెలతో పాడి రైతులకు ఉత్తమ సేవలు అందిస్తూ జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలోని ప్రతి వైద్యశాలకు వైద్యశాల స్థాయిని బట్టి ప్రతి మూడు నెలలకు ఒకసారి రూ.50 వేల నుంచి లక్ష వరకు స్థానిక అవసరాల ప్రకారం మందులను మెడిసిన్ మేనేజ్మెంట్ సిస్టం(ఎంఎంఎస్) విధానం సంబంధిత పశు వైద్యులు ఇండెంట్ పెట్టిన మందులను హాస్పిటల్‌కు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఆర్‌బికెకు నెలకు రూ.5 వేల చొప్పున ఒక సంవత్సరానికి సరిపడా మందులను ప్రతి ఆర్‌బికెకు అందించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రతి వైద్యశాలలో మందులకు ఇబ్బంది లేదన్నారు. జిల్లాలో ఆర్‌బికెల ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా దాణా, పశుగ్రాస విత్తనాలు, గడ్డి కత్తిరించు యంత్రాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేశారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,929 మెట్రిక్ టన్నుల టిఎంఆర్ (సంపూర్ణ సమీకృత దాణా)ను 60 శాతం సబ్సిడీతో 5,052 మంది రైతులకు అందించామన్నారు. 213 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను 6,110 రైతులకు 75 శాతం సబ్సిడీతో అందించడం జరిగిందన్నారు.

జగనన్న పాలవెల్లువ ద్వారా మహిళా పాడి రైతులకు మెరుగైన పాలధరను, పాడి రైతుల ఆదాయాన్ని పెంచుటకు ప్రభుత్వం జిల్లాలో అమూల్ డైరీ ద్వారా పాల సేకరణ జరుగుతుందన్నారు. జిల్లాలో మొదటి దశలో 12 మండలాల్లోని 20 రూట్ల ద్వారా 142 గ్రామాల్లో ప్రారంభించబడి రోజుకు 18 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందన్నారు.

పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. రేషన్ కార్డు కలిగి ఉన్న రైతులు తమ వాటా కింద 20 శాతం, రేషన్ కార్డు లేని వారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే వైఎస్ఆర్ పశు బీమా పథకానికి అర్హత పొందుతారని తెలియజేశారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్నో పోరాటాల ఫలితంగా 2012లో రద్దైన అప్రెంటిస్ విధానాన్ని మరలా రాబోయే డిఎస్‌సి నియామకాల్లో అమలు చేయాలంటూ ప్రభుత్వం రిలీజ్ చేసిన నోటిఫికేషన్ ప్రతులను యుటిఎఫ్ నాయకులు దహనం చేసి, అప్రెంటిస్ పునరుద్ధరణపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. యుటిఎఫ్ ముదినేపల్లి శాఖ తరపున మండల అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎంవి బేతాళ రావు, పులి శ్రీనివాసరావు, సింహాచలం, మస్తాన్ యుటిఎఫ్ బాధ్యులు ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ సోమవారం ముదినేపల్లిలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు టిడిపి, జనసేన, కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఒపిఎస్ విధానం పునరుద్ధరించాలంటూ పోస్ట్‌కార్డు క్యాంపెయిన్, 1992లో రద్దు చేసినటువంటి డిఎస్‌సి రెగ్యులర్ విధానాన్ని మరల అమలు చేయాలంటూ డిఎస్‌సి అప్రెంటిస్ పత్రాలను దహనం చేశారు.

ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, తహశీల్దార్ జోహర్ బాజీ సోమవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు వారు తెలిపారు. ముసునూరు ఎస్ఐ పి.వాసు, సచివాలయ సిబ్బంది, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటించాలి

ఏలూరు: రోడ్డు ప్రమాదాలు నివారించడానికి భద్రతా నియమాలు పాటించాలని మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ కెవిఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో సోమవారం వట్లూరు సర్ సిఆర్ రెడ్డి మహిళా కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీబ్రా గుర్తు వున్నచోట మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్ పాత్ లేని చోట్ల రోడ్డుకు కుడి వైపున నడవాలన్నారు. వాహనాలు నడుస్తున్నపుడు ట్రాఫిక్ ఐలెండ్(రోడ్డు మధ్యలో వుండే కట్ట) నుంచి బయటకు అడుగు పెట్టడం చాలా ప్రమాదమని, కనపడని రోడ్డు మలుపులు దగ్గర దాటేటప్పుడు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్, సీటుబెల్ట్ ఉపయోగించడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో జి.ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపల్ పి.శైలజ, సిబ్బంది, కళాశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు అందజేస్తున్న రాఘవ దంపతులు

యువతకు వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి – చాట్రాయి

మండలంలోని పోలవరం గ్రామంలో యువకులకు మాజీ ఎంఎల్ఎ, ప్రస్తుతం ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చిన్నం రామకోటయ్య ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేశారు. రామకోటయ్య అనుచరులు అభిమానులు వీర రాఘవ రాజు, ఆయన సతీమణి శ్యామల చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యామల వీరరాఘవ రాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో నైపుణ్యం సాధించాలని, అవసరమైతే ఆయనతో రామకోటయ్య యువకులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఆయన ప్రోత్సాహంతో ముందుకెళ్లాలని కోరారు.

వాలంటీర్ల ద్వారా ప్రజలకు లబ్ధి

ప్రజాశక్తి – ముసునూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాలంటీర్ల ద్వారా ప్రజలకు ఎన్నో పథకాలు చేకూరుస్తున్నారని ముసునూరు మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ముసునూరు గ్రామంలో మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ ఇంటి వద్ద వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ మాట తప్పని, మడం తిప్పని నాయకుడు మన జగన్మోహన్ రెడ్డి అయితే అంతకుమించిన నాయకుడు నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ, ప్రియతమ నేత మేక వెంకట ప్రతాప్ అప్పారావు అని కొనియాడారు. సోమవారం జరిగిన సమావేశంలో గోపాలకృష్ణ దంపతులు మహిళా వాలంటీర్లందరికీ బట్టలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు, సిఎం ఆఫీస్ నుంచి రవి ప్రకాష్, మాజీ ఎంపిటిసి చిన్నం రవికుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కరాటే పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి – చింతలపూడి

ఫిబ్రవరి 11వ తేదీన విజయవాడలో నిర్వహించిన 1వ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే పోటీలలో చింతలపూడి శ్రీచైతన్య స్కూల్‌కి చెందిన 16 మంది విద్యార్థులు 19 పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ సురేష్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు నితీష్, అయాన్, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు జెస్వంత్, అష్రఫ్, కృతిక్, అక్షిత్ పాల్, రజత పతకాలు అంశు (2), జమాల్ (2), శ్రీరామ్(2), మహిధర్, కార్తికేయ, అక్షయ, ప్రాణీత్, లిఖిత్ వర్ధన్, ఫణీంద్ర, మణికంఠ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, కోచ్ సుమన్ రాజులను, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఝాన్సీ, ఎఓ రవీంద్ర ప్రశంసించారు.

గుండెపోటుతో మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని బొమ్మినంపాడు గ్రామ మాజీ సర్పంచి కరేటి గోవిందరాజులు(58) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. గత నాలుగు రోజులుగా విజయవాడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గోవిందరాజుకు భార్య, ముగ్గురు వివాహితులైన కుమారులు ఉన్నారు. మూడు రోజుల క్రితమే ఆయన కోడలు మరణించగా, ఇప్పుడు గోవిందరాజులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గోవిందరాజులు వైసిపి సీనియర్ నాయకుడు, ప్రస్తుతం మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

'ఎన్నికల్లో జనసేనదే విజయం'

ప్రజాశక్తి – టి.నరసాపురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన విజయం సాధిస్తుందని జనసేన పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని తెడ్లం గ్రామంలో సోమవారం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశం జనసేన మండల అధ్యక్షులు అడపా నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని తెలిపారు. టికెట్ ఎవరికి వచ్చినా ఒకరికొకరు సమన్వయంతో పని చేసుకోవాలని కోరారు. వైసిపి నాయకులు ఓటమి భయంతో పుకార్లు సృష్టిస్తున్నారని, ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శి గడ్డమడుగు రవి కుమార్, దిరిశాల బ్రహ్మం, సంజయ్ పాల్గొన్నారు.

సమావేశంలో చిర్రి బాలరాజు

మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్ఆర్ ఆసరా దోహదం

పోలవరం ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి – టి.నరసాపురం

మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్ఆర్ ఆసరా పథకం దోహదపడుతుందని, ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి వుందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో సోమవారం వైసిపి ఏలూరు పార్లమెంటు ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్ యాదవ్, పోలవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి 4వ విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపథకం మహిళల పేర పెట్టి మహిళా పక్షపాతి అని నిరూపించారని తెలిపారు. ప్రతి మహిళ లక్షాధికారి కావడమే ఆయన ఉద్దేశమన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా మండలంలో 1,194 గ్రూపుల్లోని 11,940 సభ్యులకు 4 విడతలుగా రూ.42 కోట్ల 16 లక్షలు పంపిణీ చేస్తుండగా నాలుగో విడత రూ.10.79 కోట్ల చెక్కులను పంపిణీతో పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి పథకాలు వినియోగించుకోవాలని కోరారు. అన్ని రకాల ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం వైసిపికేనన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, పోలవరం నియోజకవర్గం పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, వాసిరెడ్డి మధు, దేవరపల్లి ముత్యయ్య, కన్నం సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

టి.నరసాపురం : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ముదినేపల్లి: ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్న ఏకైక నాయకుడు సిఎం జగన్మోహన్ రెడ్డి అని ఎంఎల్ఎ డిఎన్ఆర్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా 4వ విడత కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మనమందరం జగన్‌కు అండగా నిలబడి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలన్నారు. అనంతరం 4వ విడత చెక్కును విడుదల చేసి డ్వాక్రా అక్క చెల్లెమ్మలతో కలిసి ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసు బాబు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సేంద్రీయ వ్యవసాయ రైతుల నుంచి సేకరించిన ఉత్పత్తులను సోమవారం విక్రయించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు పద్మ, లక్ష్మి, రాణి మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతుల నుంచి సేంద్రీయ సాగు ఉత్పత్తులను సేకరించి అతి తక్కువ ధరకే ప్రజలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పురుగు మందులు ఉపయోగించే ఉత్పత్తులతో ప్రజలకు అనారోగ్యం కలగజేస్తాయని, సేంద్రీయ ఉత్పత్తులతో ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రం

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్మించిన సంపద సృష్టి కేంద్రం నిరుపయోగంగా తయారైంది. గ్రామాల్లోని చెత్త సేకరించి ప్రాసెసింగ్ చేయడం ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా నిర్మించడం వల్లనే గ్రామంలోని సంపద సృష్టి కేంద్రం ధ్వంసం అయినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రానికి మరమ్మత్తులు చేసి, వినియోగంలోనికి తేవాలని వారు కోరారు.

గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి – నిడమర్రు

గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు కోరారు. నిడమర్రులో ప్రజా సంఘాల కార్యాలయంలో పెనుకొండ అనామని అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్లలో రైతులు, వ్యవసాయ కార్మికులతో పాటు అసంఘటితరంగా కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌ల పేరుతో కార్పొరేట్లకు అనుకూలమైన చట్టాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సంఘాల నాయకులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కె.నాగేశ్వరి, కోరాడ రమణ, పి.వెంకటలక్ష్మీ, రైతు సంఘం నాయకులు కానురురాజు మోహన్ చంద్రరావు, సొంబాబు పాల్గొన్నారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిణి తేజమని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించాలని, ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయాలని అధికారులను ఆదేశించారు.

నూజివీడులో కొండా రామకృష్ణ వర్ధంతి సభ

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలో సోమవారం కామ్రేడ్ కొండా రామకృష్ణ వర్ధంతి సభ సందర్భంగా సిపిఎం నాయకులు సంతాపాన్ని తెలియజేశారు. సంతాపం తెలియజేసిన వారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, ఇ.దుర్గారావు, ఎకెడి.ప్రసాద్, మరియదాసు, వసంతరావు ఉన్నారు.

వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్న నేతలు

మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ప్రజాశక్తి – ముసునూరు

రాజ్యాంగబద్ధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య తెలిపారు. అఖిలభారత ప్రగతి శీల మహిళా సంఘం 30వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా సోమవారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జెండా ఆవిష్కరణ మండల కార్యదర్శి వేముల బక్కయ్య చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన దారుణ మారణ, హత్యాకాండ ఖండించాలన్నారు. మహిళలకు న్యాయం చేయాలని, మహిళలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోని మోడీ ప్రభుత్వాన్ని 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. ఈనెల 16వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జరుగు భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లి పాము భవాని, ఆమదాల పుష్పలత పాల్గొన్నారు.

డాక్టర్ సుధాకర్ మృతి తీరని లోటు

ఎంపిపి సుంకర వెంకటరెడ్డి

ప్రజాశక్తి – పోలవరం

మండలంలోని పోలవరం ప్రభుత్వ హాస్పిటల్‌లో డాక్టర్‌గా రోగులకు జివిజికె.సుధాకర్ అందించిన సేవలు వెలకట్టలేనివని పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం ప్రభుత్వ హాస్పిటల్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన సుధాకర్ తదనంతరం కూడా స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందించే వారని ఎంపిపి అన్నారు. ఆయన మరణం స్థానిక ప్రజలకు తీరని లోటని తెలిపారు. పోలవరం ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో మండల వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు సోమవారం డాక్టర్ సుధాకర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సంతాప సభకు హాస్పిటల్ డాక్టర్లు, పార్టీలకు అతీతంగా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని కీర్తిశేషులు సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కీర్తిశేషులు డాక్టర్ సుధాకర్ పోలవరం హాస్పటల్‌లో డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి తన చివరి శ్వాస వరకు ప్రజలకు వైద్య సేవలు అందించారని కొనియాడారు. కరోనా కష్టకాలంలోనూ 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించేవారని గుర్తు చేసుకున్నారు. వైద్య వృత్తికి వన్నెతెచ్చిన డాక్టర్ సుధాకర్ సహోద్యోగులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, మహిళా నాయకురాలు షేక్ ఫాతిమా మున్నీసా, జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి వీర వెంకట సత్యనారాయణ, టిడిపి నాయకులు కుంచె దొరబాబు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

శనివారపు పేట కాజ్ వేపై వంతెన నిర్మించాలని సిపిఎం శాఖ కార్యదర్శి గొట్టాపు రవి కిషోర్ డిమాండ్ చేశారు. సోమవారం శనివారపు పేటలో సిపిఎం శనివారపు పేట శాఖ సమావేశం గొట్టాపు మురళీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి కిషోర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ఏలూరు శనివారపు పేట కాజ్ వేపై వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో తమ్మిలేరు పొంగినప్పుడల్లా ఈ కాజ్ వేపై రాకపోకలు స్తంభించిపోతున్నాయని అన్నారు. పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల దశాబ్దాల తరబడి ఈ వంతెన నిర్మాణం జరగలేదని విమర్శించారు. ఇటీవల శనివారపు పేట కాజ్వేపై వంతెన నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయన్నారు. కాని ఎందుకు వంతెన నిర్మాణం చేపట్టలేదో పాలకపక్షం తెలియజేయాలని డిమాండ్ చేశారు.

శనివారపు పేట గ్రామంలో మురికివాడలో పేదలు రోడ్లు, డ్రయినేజీలు, వీధిలైట్లు, తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం శాఖ డిమాండ్ చేసింది. శనివారపు పేటలో ప్రజల సమస్యలపై భవిష్యత్తులో ఆందోళనలు నిర్వహించాలని సిపిఎం కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, శాఖ కమిటీ సభ్యులు పిల్ల జోగినాయుడు, జి.రంగమని పాల్గొన్నారు.

పోలవరం కేంద్రంగా గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలి

ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి – పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ముంపుకు గురైన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల్ని ఒకే జిల్లా కింద తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని అఖిలపక్ష ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఎప్పటి నుంచో డిమాండ్‌గా వున్న పోలవరం గిరిజన జిల్లాను తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ పోలవరంలోని పాతపోలవరం గ్రామ దేవత కడెమ్మ గుడి పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాలు, కుల సంఘాల నాయకులతో అఖిలపక్ష ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు నాళం గాంధీ, బుగ్గ మురళీకృష్ణ, సొబ్బనమోహన్, మంగిన వెంకటరమణ(కొండ) మాట్లాడుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని అధికార, ప్రతి పక్ష నాయకులు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అందువల్ల జిల్లా చేయటానికి తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఏర్పాటు చేసే వరకు జెఎసి ఆధ్వర్యంలో పోరాటం జరుతుందని తెలిపారు. మొదటిగా పోలవరం గ్రామంలో, మండలంలోని అన్ని గ్రామాలలో ప్రచారం చేయనున్నట్లు తెలియజేశారు. ఈ ఉద్యమం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని అన్ని ఏజెన్సీ మండలాల్లో, గిరిజన నియోజకవర్గాల్లో నాయకులు, ప్రజలతో కలిపి విస్తృత పరిచి, ఉధృతం చేయనునట్లు చెప్పారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరించి వినతి పత్రాలను ఇస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసిత గ్రామాలు ఖాళీ చేసి పునరావాస గ్రామాలకు తరలిపోవడంతో వ్యాపారాలు లేక వ్యాపారస్తులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలియజేశారు. వేలాదిమంది జనాలతో ఎటుగట్టు సెంటర్‌లో ఈనెల 17వ తేదీన పెద్ద ఎత్తున ధర్నా, సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గంగు అనిల్ కుమార్, ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి గ్రంథాలయం వరకు రూ.30 లక్షల నిధులతో నిర్మించబోతున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించిన రెండు మైక్రో ఫిల్టర్స్ పైప్ లైన్‌లను, గడపగడపకూ మన ప్రభుత్వం రూ.15 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే మండలంలోని సంఘర్షణ పురం, పెనుమల్లి గ్రామాల్లో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మొట్రూ ఏసు బాబు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

రాష్ట్రంలో నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి స్కిల్డ్, సెమి స్కిల్, అన్ స్కిల్డ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, డిఎంఎ అధికారులు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కోటదిబ్బ ఎస్ఆర్‌వన్ వద్ద ఉద్యోగ సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన మూడు సంవత్సరాల సరెండర్ లీవ్‌ని చెల్లించాలని, ఏలూరు కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీల కాంట్రాక్ట్ కార్మికులకు 2022 జూన్ వేతన బకాయిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎంవి.సుబ్బారావు, సిహెచ్ హరినాథ్ బాబు, బి.దుర్గాప్రసాద్, డి.వెంకట్ పాల్గొన్నారు.

చింతలపూడి: ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం ఆధ్వర్యాన సమ్మె చేయగా ప్రభుత్వం చర్చిలకు పిలిచి జీతం రూ.21 వేలు చేస్తున్నామని చెప్పి నేటి వరకు జిఓ విడుదల చేయలేదని ఎఐటియుసి చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వెలగాడి అనురాధ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను జిఓ రూపంలో విడుదల చేయడంలో ఉన్న జాప్యాన్ని నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పండగ అలవెన్స్ రూ.వెయ్యి ఇస్తామని జిఓ విడుదల చేసి నేటి వరకూ ఇవ్వలేదన్నారు. జిఓ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ్ వెంకటయ్య, పార్వతి, బొత్స నారాయణ, మొగులపాటి పుల్లయ్య, సాయమ్మ, కృష్ణ, బి.సరోజిని, బి.రాజేష్ నాయకత్వం వహించారు.

చింతలపూడి: నల్లబ్యాడ్జీలతో నిరసన

మాట్లాడుతున్న జనసేన నేతలు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలి

ప్రజాశక్తి – నూజివీడు రూరల్

టిడ్కో జి ప్లస్ త్రీ గృహాల నిర్మాణాలను పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరుతూ జనసేన నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరీదు శివరామకృష్ణ, ముత్యాల కామేష్, ముమ్మలనేని సునీల్ కుమార్, బోను అప్పారావు, బండారు రాజు, యర్రంశెట్టి రాము, దద్దనాల రవి కిషోర్ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

దేవపూడిలో చోరీ

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు, వెండి వస్తువులు అపహరించినట్లు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన త్రిపురనేని ఈశ్వరరావు గుడివాడలో నివాసం ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు దేవపూడిలో నివాసం ఉంటున్నారు. గతనెల 22వ తేదీ ఈశ్వరరావు తండ్రి తలకు గాయం కావడంతో ఇంటికి తాళాలు వేసి తండ్రిని గుడివాడ తీసుకువెళ్లి కుమారుడు చికిత్స చేయిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం ఈశ్వరరావు దేవపూడిలోని ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. లోనికి వెళ్లి చూడగా ఇనుప బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న బంగారం, వెండి, ఇతర వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈశ్వర రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా, క్లూస్ టీం సంఘటన స్థలానికి వచ్చి ఆధారాలు సేకరించారు.

25 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి – పోలవరం

అక్రమ సారా బట్టీలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ రైటర్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట గ్రామం శివారున కాలువల పక్కన అక్రమ సారాబట్టీలు నిర్వహిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందని, ఆ ప్రాంతంలో సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. సారా బట్టి నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు అన్నారు. పరారీలో ఉన్న సంసాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

PASSPORT CHANGE IN NAME

THOTA JAYA LAKSHMI, W/o.Bhaskara rao, H.No.5-3-68, Mekala kamela, Mentevari Thota, Bhimavaram, W.G.Dt., Andhra Pradesh, Pin: 534201. I have Changed my name from **TOTA JAYALAKSHMI (Old Name) to THOTA JAYALAKSHMI (New Name)** Hence after all my Documents and Correspondents will be continue with my **New Name THOTA JAYA LAKSHMI.**

THOTA JAYALAKSHMI
W/o.Bhaskararao, Mentevari Thota
Bhimavaram, W.G.Dt. Ph:9010634555

PASSPORT CHANGE IN NAME

THOTA MOHAN MURALI VENKATA BRAHMAJI, S/o.Thota Bhaskara rao, H.No.5-3-68, Mekala kamela, Mentevari Thota, Bhimavaram, Pin: 534201. W.G.Dt., Andhra Pradesh, I have Changed my name from **TOTA MOHAN MURALI VENKATA BRAHMAJI (Old Name) to THOTA MOHAN MURALI VENKATA BRAHMAJI (New Name)** Hence after all my Documents and Correspondents will be continue with my **New Name THOTA MOHAN MURALI VENKATA BRAHMAJI.**

THOTA MOHAN MURALI VENKATA BRAHMAJI,
S/o.Bhaskararao, Mentevari Thota,
Bhimavaram, W.G.Dt. Ph:9010634555

PASSPORT CHANGE IN NAME

THOTA BHASKARA RAO, S/o.Brahmayya, H.No.5-3-68, Mekala kamela Steet, Mentevari Thota, Bhimavaram, W.G.Dt., Andhra Pradesh, Pin: 534201. I have Changed my name from **TOTA BHASKARARAO (Old Name) to THOTA BHASKARARAO (New Name)** Hence after all my Documents and Correspondents will be continue with my **New Name THOTA BHASKARA RAO.**

THOTA BHASKARA RAO
S/o.Brahmayya, Mentevari Thota
Bhimavaram, W.G.Dt. Ph:9010634555

IN THE COURT OF THE
HON'BLE III ADDL. JR. CIVIL
JUDGE CUM - EXCISE
MAGISTRATE
AT SANGAREDDY
0.S. NO. 1341 OF 2022.

Between :
Gangyada Laxmi & another ...Plaintiffs
AND
Yerra Laxmi & Yellamma & Others ...Defendants

NOTICE

To
Sri. Sheshaganapati Seetaramaraju,
S/0. Ramakrishna Raju, Age : 55 yrs,
Occ: Agri, R/0. H.No. 79-8-10, Postal Colony, Rajamandri, West Godavari district.

Whereas the plaintiffs has filed the suit for partition and separate possession in respect of suit schedule properties against you and others. The case stands posted on 29-02- 2024 for your appearance either in person through an advocate before the said court on the said date at 10.30 a.m. if you fails to appear on the said date and time before the said court the case will be decided as per law.

/ BY ORDER OF THE COURT / /
V.MANJULA REDDY,
Advocate,
Sangareddy.
CELL NO. 8522944746.

CanFinHomes Ltd
(Sponsor: CANARA BANK)
HOME LOANS ✦ DEPOSITS
Translating Dreams into Reality

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
(CIN : L85110KA1987PLC008699)
2-1-50, ఫ్లాట్ నెం.4, గ్రౌండ్ ఫ్లోర్, ఎస్‌వివిఆర్ టవర్స్, జె.పి.రోడ్, భీమవరం-534202. ఫోన్: 7625 013254
08816- 297744, ఇ-మెయిల్: bhimavaram@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.13,33,820/- (అక్షరాల పదమూడు లక్షల ముప్పై మూడు వేల ఎనిమిది వందల ఇరవై రూపాయలు మాత్రమే)** మరియు తిరిగి చెల్లించే వరకు వడ్డీతో సహా నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన **ఋణగ్రహీతలు: శ్రీ నక్కెళ్ళ వెంకట అప్పారావు మరియు శ్రీ నక్కెళ్ళ కృష్ణారావు** గార్లను కోరుతూ **తేది.01.12.2023**న **డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.08.02.2024**న దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.13,33,820/- (అక్షరాల పదమూడు లక్షల ముప్పై మూడు వేల ఎనిమిది వందల ఇరవై రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీ **కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం ఎస్ఆర్ఓ, వీరవాసరం మండలం, వీరవాసరం గ్రామం, ఆర్ఎస్ నెం.536/8లో, డి.నెం.12-19 వద్ద ఉన్న 194 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం అందుగల రెసిడెన్సియల్ భవనము యావత్తు ఆస్తి నందు అన్ని ఈజుమెంటరీ హక్కులతో సహా. **హద్దులు: తూర్పు :** ఉమ్మడి నడకదారి, **దక్షిణం :** పంచాయితీ రోడ్ (పుంత), **పడమర :** ఎన్. పెద్దరామారావు గారి స్థలం మరియు లేన్, **ఉత్తరం :** డి. అప్పన్న గారి స్థలం మరియు లేన్.

తేది : 12.02.2024
ప్రదేశం : భీమవరం

సం/- అధీకృత అధికారి
కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్